క్లుప్తంగా

డీడీఎన్‌లో రంగనాథుడిని చేర్చండి



బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ శివారులో రంగనాథ ఆలయాన్ని దూప, దీప నైవేద్యం(డీడీఎన్) పథకంలో చేర్చాలని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి కోరారు. గ్రామానికి తొలిసారిగా వచ్చిన కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. రంగనాథుని ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్వారి తులసికి అభినందన



ఆర్మూర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జాతీయ స్థాయిలో పుడమి రత్న విశిష్టసేవ అవార్డు అందుకున్న సామాజిక సేవకుడు పట్వారి తులసిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అభినందించారు. ఇలాంటి అవార్డు అందుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్, డీఈవో అశోక్, డీఎంహెచ్‌వో రాజశ్రీ పట్వారి తులసి అభినందించారు.

సభను విజయవంతం చేయండి



కమ్మర్‌పల్లి: ప్రపంచ విప్లవ నిర్మాత లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి అశోక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వర్ధంతి సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 21న హైదరాబాద్‌లో నిర్వహించే లెనిన్ వర్ధంతి ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు సురేశ్, బాలయ్య, బాలకిషన్, సత్తెక్క తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి వివేక్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ హ్యాండ్‌బాల్ పోటీల్లో వివేక్ పాల్గొంటాడని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థి వివేక్‌ను అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, దయ్యాలు, దిలీప్, ప్రేమ్, రవి, స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు పీడి జ్ఞానేశ్వర్, పీఈటి రాజేందర్ అభినందించారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆర్మూర్‌టౌన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల ఫీజును ఈనెల 30లోగా చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుముతో ఫిబ్రవరి 10వ తేది వరకు రూ. 500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో వంద సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ గా ఉన్న సీట్లకు విద్యార్థులు వచ్చే నెల 28 లోగా ఆ న్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సంచార చేపల వాహనానికి..

ఇందల్వాయి: సంచార చేపల వాహనాన్ని రాయితీపై పొందేందుకు ఆసక్తి ఉన్న గంగపుత్రులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సువర్ణ పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు మహిళ సమాఖ్య ద్వారా రాయితీ అందిస్తామని అన్నారు. వాహనం విలువ రూ. పది లక్షలు కాగా రూ. ఆరు లక్షల రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. దీంతో పాటు క్యాంటీన్ నిర్వహణపై ఆసక్తి ఉన్న మహిళలకు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి క్యాంటీన్ ఏర్పాటుకు సహకారం అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఇందల్వాయి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎట్టకేలకు పనులు ప్రారంభం

- నాలుగు గ్రామాల ప్రజలకు తగ్గనున్న దూరభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, రైతులు



రెంజర్ల–వన్నెల్(బి) రోడ్డులో వేసిన కంకర

బాల్కొండ: ఎట్టకేలకు ముప్కాల్ మండలం రెంజర్ల–వన్నెల్(బి), రెంజర్ల డంపింగ్ యార్డు మీదుగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మార్గంలో ఏర్పడిన గుంతల్లో కంకరను నింపుతున్నారు. ఆ తర్వాత రోలర్‌తో తొక్కించి రహదారిని నిర్మించనున్నారు. బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2.8 కోట్లు ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి గత ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 సెప్టెంబర్‌లో పనులకు నాటి పాలకులు శంకుస్థాపన చేశారు. సాధారణ ఎన్నికల లోగా పనులు పూర్తి చేస్తామని చెప్పినా పూర్తి కాలేదు. ఏడాదిగా ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గత నెల రోజుల క్రితం ప్రారంభం కాని రోడ్డు పనులను పరిశీలించి త్వరలోనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లింకు రోడ్డు..

రెంజర్ల–ధర్మోరా నుంచి వచ్చే వన్నెల్(బి) రోడ్డుకు లింకు రోడ్డుగా ఉపయోగ పడుతుంది. దీంతో రెంజర్ల, వెంచిర్యాల్,వెల్కటూర్,శెట్‌పల్లి గ్రామాల ప్రజలకు బాల్కొండ వైపు వెళ్లేందుకు దూరభారం తగ్గుతుంది.రెంజర్ల జీపీ ఆధ్వర్యంలో నిర్మించిన డంపింగ్ యార్డు మీదుగా రోడ్డు కావడంతో డంపింగ్‌కు కూడా తిప్పలు తప్పాయి. ప్రధానంగా రోడ్డుకు ఇరువైపుల వందల ఎకరాల పంట భూములు ఉన్నాయి.రైతులు పొలాలకు వెళ్లేందుకు కూడా తిప్పలు లేకుండా ఉంటుంది. ఇలాంటి ప్రయోజనాల కోసం ఆ రోడ్డు పంచాయతీరాజ్‌లో కాని,రోడ్డు భవనాల శాఖలోకాని లేకున్న ప్రత్యేక జీవోతో మాజీమంత్రివేముల ప్రశాంత్‌రెడ్డి నూతన రోడ్డును మంజూరు చేశారు.

పనులు పూర్తి చేస్తాం

రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పనులు ప్రారంభమయ్యాక ముందుకు సాగుతూనే ఉంటాయి. రోడ్డుకు ఇరువైపుల ఉన్న రైతులు సహకరించాలి.

– నాందేవ్, డీఈ, ఆర్‌అండ్‌బీ, బాల్కొండ

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం



బోధన్‌లో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రెంజల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రతి ఏడాది 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపాడతామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించే సాయంతో పాటు కొంతమేర సొంత ఖర్చుతో నిర్మాణం చేపడితే మంచి ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో సాలూర, బోధన్ మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, గంగాశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్: రెంజల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో పని చేసే వారిని గుర్తించి ఎన్నుకోవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నా యకులు నాగభూషణంరెడ్డి, సాయారెడ్డి, ధనుంజయ్, రాములు, ఇందిరారెడ్డి, కవిత, సవిత, సాయిబాబాగౌడ్, పోచయ్య, కృష్ణ, మోహన్ పాల్గొన్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. విడతల వారీగా పేదలకు నియోజకవర్గంలో ఇళ్లను అందిస్తామన్నారు. పోలీసు అధికారులు భూసమస్యల్లో తలదూర్చరాదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, నాయకులు బిల్లా రామ్మోహన్, రజిత యాదవ్, భాస్కర్ రెడ్డి, కృష్ణారావు, విజయ్ కుమార్ గౌడ్, అమలుల్లా షరీఫ్, కాజా, తాహెర్, మల్కారెడ్డి, నారాయణ చౌదరి, కిశోర్, బొబ్బిలి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



వేల్పూర్: లక్కోరలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



ఆర్మూర్‌లో ..

వేల్పూర్/ ఆర్మూర్‌టౌన్/ పెర్కిట్/ వర్ని: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించనున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా అర్హుల లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వేను అధికారులు శుక్రవారం పరిశీలించారు. వేల్పూర్ మండలం లక్కోరలో ఆహార భద్రత కార్డుల సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఆర్మూర్ పట్టణంలోని నెహ్రూ కాలనీలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ పరిశీలించారు. పట్టణంలోని 6, 7, 8, 9, 21, 24వ వార్డులలో కొనసాగుతున్న రేషన్‌కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పెర్కిట్, మామిడిపల్లిలో కొనసాగుతున్న రేషన్‌కార్డు లబ్ధిదారుల సర్వేను పరిశీలించారు. ఆలూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు భరోసా సర్వేను తహశీల్దార్ రమేశ్, ఏవో రాంబాబు పరిశీలించారు.

వర్ని మండలంలో నిర్వహిస్తున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేలను మండల ప్రత్యేకాధికారి రవీందర్ పరిశీలించారు. తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



మామిడిపల్లిలో..



వర్నిలో..

భూములకు పట్టాలు ఇవ్వాలి



రుద్రూర్: ప్రభుత్వం పంపిణీ చేసిన వ్యవసాయ భూములకు పట్టాపాస్ బుక్‌లు ఇవ్వాలని కోరుతూ పొతంగల్ మండలం చేతన్‌నగర్ రైతులు తహసీల్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వ్యవసాయ భూమి లేని 90 మందికి ఒక్కొక్కరికి 17 గుంటల భూమిని ఇచ్చిందని అందులో 50 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వలేదన్నారు. దీంతో ప్రభుత్వం అందించే సహాయం లభించడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చందర్, మారుతి, గంగాబాయి, కవిత ఉన్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలనే..



వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్‌నాం చేయాలన్న దురుద్దేశంతోనే బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేయడం లేదన్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు దామోదర్‌గౌడ్, రమణ, నరేందర్, మల్లేశ్, మల్లయ్య, రవి, మల్లారెడ్డి, మోహన్, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



వేల్పూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్/ బాల్కొండ: వేల్పూర్ మండలంలో పలు గ్రామాలకు చెందిన 35 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. 35 మందికి రూ.9లక్షల34వేలు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో, రెంజర్ల గ్రామంలో పలువురి బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నారెడ్డి, ముస్కుమోహన్, రాములు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..

సొంత పార్టీ నాయకులపై విమర్శలు తగవు



సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్ బాబా, నాయకులు

వర్ని: కాంగ్రెస్ పార్టీలో ఉండి పార్టీ ఎమ్మెల్యేను, నాయకులను విమర్శించడం ఎంతవరకు సమంజసమని వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేశ్ బాబా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసరావు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డిపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్‌పై, నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే ఖండించాల్సింది పోయి సొంత పార్టీ నాయకులను విమర్శించడం తగదని అన్నారు. పార్టీలో ఉండి పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై విమర్శలు చేస్తే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రణజా నాయక్, నారోజీ గంగారాం, సాయిబాబా, శ్రీనగర్ రాజు, వీర్రాజు, సాయాగౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను సాధించుకుందాం



మాట్లాడుతున్న మచ్చ దేవేందర్

బోధన్‌టౌన్: ఎస్సీ వర్గీకరణను సాధించుకుందామని మాదిగ రాష్ట్ర కళామండలి రాష్ట్ర కో–ఆర్డినేటర్ మచ్చ దేవేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి కళాబృందం రథయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు ఫిబ్రవరి 7న లక్ష డప్పులు, వేయి గొంతుకల మహాసభను విజయవంతం చేయడానికి రథయాత్ర కొనసాగుతుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 58 మండలాల్లో కళాబృందం రథయాత్ర సాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 23 న జిల్లా కేంద్రంలో తలపెట్టిన ఉమ్మడి జిల్లాల సన్నాహక సదస్సుకు మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సభను మాదిగలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూమన్న, నల్ల మహేందర్, డప్పు సంతోష్, రాంపూర్ సాయి, నవీన్, దల నర్సింగ్, గోనె మారుతి, తాడెం అబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

సన్మానం..

పల్లె గంగారెడ్డికి సన్మానం



బోధన్/ పెర్కిట్: జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియామకమైన పల్లె గంగారెడ్డిని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఘనంగా సన్మానించారు. సుధాకర్ చారి, బాల్‌రాజ్, వినోద్, రామరాజు, ప్రతాప్‌గుప్తా, సంగ్రాం పటేల్, ధర్మన్న, సాయినాథ్, కందికట్ల వాసు తదితరులు ఉన్నారు. పసుపు బోర్డు చైర్మన్‌గా నియామకమైన గంగారెడ్డిని అంకాపూర్ బీజేపీ నాయకులు సన్మానించారు. నాయకులు బండారి యాదగిరి, డి రమేశ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి..



మాక్లూర్: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించిన వద్యాట్‌పల్లికి కీర్తనను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగామోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాంమందిర్ పాఠశాలలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆర్మూర్ నగరం ఆధ్వర్యంలో సామాజిక సమరసతలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్మికులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో గాజుల దయానంద్, అల్జాపూర్ అక్షయ్, నిఖిల్, గంగాచరణ్, గంగాధర్‌గౌడ్, కత్తి శీను, అజయ్, ప్రవీణ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రతినిధులు



నవీపేట: మండల కేంద్రంలోని మహోదయ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మోస్రా సాయారెడ్డి, గోవర్ధన్, భగవాన్, రాజేంద్రకుమార్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, డాంగె శ్రీనివాస్, సూరిబాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు సమావేశం

నవీపేట: మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాక్లూర్:విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా నందిపేట్, మాక్లూర్, చిక్కిలి, గొట్టుముక్కల సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ అశోక్ శుక్రవారం తెలిపారు. విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నవీపేటలో..

నవీపేట: మండలంలోని రాంపూర్, నిజాంపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మహాపాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



రుద్రూర్: సద్గురు సిద్ధి లింగేశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సుంకిని–కొలను పాక మహా పాదయాత్ర పోస్టర్లను పొతంగల్ మండలం సుంకినిలో శుక్రవారం నిర్వాహక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. పాదయాత్ర వచ్చే నెల 3న ప్రారంభమై 12న ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో నాగభూషణం, కుర్ల రాజు, సంతోష్, సంజీవ్ కుమార్, గంగాధర్ పటేల్, నాగేశ్ పటేల్, సంపత్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40, పుష్ప-2(తెలుగు)-10.00
స్క్రీన్-2 –	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3–	డాకు మహారాజు (తెలుగు)- 10.10, 1.15, 4.20, 7.25, 10.30
స్క్రీన్-4	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు) - 12.00, 3.00, 6.00, 9.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.45,4.30,7.25, 10.20
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్ -1.10,7.35 10.35, డాకు మహారాజు(తెలుగు)-4.30
స్క్రీన్-3	డాకుమహారాజు(తెలుగు)-11.00, 7.35,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.10, 1.10, 4.10, 7.10, 10.10
స్క్రీన్-2	డాకు మహారాజు (తెలుగు)- 10.20, 1.25, 7.35, 10.40, ఎమర్జెన్సీ(హిందీ)-4.30
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40, ఎమర్జెన్సీ(హిందీ)-10.00
స్క్రీన్-4	ఎమర్జెన్సీ(హిందీ)-12.00, ఆజాద్(హిందీ)-3.05, 10.15, పుష్ప-02(తెలుగు)-6.10
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,100	వెండి(కిలో)	95,500
22 క్యారెట్స్	74,830		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800